# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటి

## పత్రికా ప్రకటన

## నేటి చైనా ఆధునిక సోషల్ సామ్రాజ్యవాద దేశమే!

**ప్రియమైన ప్రజలారా, విప్లవాభిమానులారా, కామ్రేడ్స్!**

ఇటీవల అక్టోబర్ మూడవ వారంలో చైనా కమ్యూనిస్టు పార్టీ తన 19వ మహాసభలను జరుపుకుంది. 2012లో జరిగిన 18వ కాంగ్రెస్‌లో తొలిసారిగా దేశ అధ్యక్షుడైన షి జింగ్ పింగ్ మరో విడుత దేశ అధ్యక్ష పదవికి ఎన్నికైనాడు. పార్టీలో అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో 440 మంది పార్టీ సీనియర్ నాయకులను, 43 మంది ఉన్నతాధికారులను, 2 లక్షల 78 వేల పార్టీ కార్యకర్తల అడ్డు తొలగించుకొని తన అనుంగు అనుయాయులతో పార్టీ నాయకత్వ స్థానాలను నింపేశాడు. 19వ కాంగ్రెస్‌లో షి జింగ్ పింగ్ ఆలోచనా విధానాన్ని ఆమోదిస్తూ మవో ఆలోచనా విధానం సరసన చేర్చి ఆ స్థాయి కల్పించారు. గతంలో డెంగ్‌కు సైతం ఇలాగే పట్టం కట్టారు. నిజానికి ఈ విశ్వ శ్రామికవర్గ ద్రోహులకు ఇప్పటికీ మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ మావో, ఆయన నాయకత్వం వహించిన పార్టీ పేరు, జెండా అవసరం ఎంత ఉందో షి జింగ్ పింగ్‌కు కాంగ్రెస్ కల్పించాల్సిన స్థాయిని బట్టి అర్థం చేసుకోవచ్చు.

కామ్రేడ్ మావో మరణానంతరం చైనాలో జరిగిన 11వ కాంగ్రెస్ నాటికే ఆ పార్టీని రివిజనిస్టు పార్టీగా మార్చివేసిన ద్రోహులు దేశ శ్రామికవర్గ నియంతృత్వాన్ని  బూర్జువా నియంతృత్వంగా మార్చివేశారు. చైనాలో సోషలిజం కోసం దృఢంగా నిలిచిన పార్టీ నాయకత్వాన్ని పెద్దఎత్తున జైలుపాలు చేసి పార్టీ నాయకత్వ ప్రముఖులను దుష్ట చతుష్టయంగా ముద్రవేసి అడ్డు తొలగించుకున్నారు. దేశాన్ని మొదట పెట్టుబడిదారీ దేశంగా తర్వాత దాని అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాదంగా మలిచారు. షి జింగ్ పింగ్ పగ్గాలు అందుకునే నాటికి చైనా ఒక ఆధునిక సోషల్ సామ్రాజ్యవాద దేశంగా మారిందని మా పార్టీ స్పష్టం చేస్తున్నది.

చైనా ఎంత మాత్రం సోషలిస్టు దేశం కాదనీ, అక్కడ ఉన్నది శ్రామికవర్గ నియంతృత్వం కానేకాదనీ మా పార్టీ స్పష్టం చేస్తున్నది. విప్లవ ద్రోహి డెంగ్ వారసుడైన షి జింగ్ పింగ్‌ను మావో సరసన చేర్చి వారికి ఆ స్థాయి కల్పించడం వారు తమ ద్రోహాన్ని నిరాఘాటంగా కొనసాగించడానికి అవసరమైన ముసుగుగానే మా పార్టీ భావిస్తోంది. నేటి చైనా ప్రపంచ ఆధిపత్యం కోసం పరుగులు పెడుతున్నది. సోషలిస్టు ముసుగులో విశ్వ శ్రామికవర్గాన్ని కొల్లగొడుతూ వంచిస్తున్నది. ఈ నంబర్ వన్ రివిజనిస్టు ద్రోహుల సామ్రాజ్యవాద స్వభావాన్ని ఎండగట్టి ప్రపంచ సోషలిస్టు విప్లవం కోసం ఎక్కడికక్కడే నిజమైన మావోయిస్టు శక్తులు దృఢంగా పోరాడాలి. వారు ఇంకెంతో కాలం ప్రపంచ పీడిత ప్రజలను, శ్రామికవర్గాన్ని తమ సోకాల్డ్ సోషలిస్టు సిద్ధాంతాలతో మోసగించలేరు. మా పార్టీ ఇటీవలే తయారుచేసిన అవగాహనా పత్రాన్ని (డాక్యుమెంటు) ఈ సందర్భంగా పరిచయం చేస్తున్నాం. పూర్తి దస్తావేజును త్వరలో అందిస్తాం.

**విప్లవాభి వందనాలతో**

**అభయ్**

Abhay

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ**

**16 నవంబరు 2017** **భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)**